క్లుప్తంగా

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రవీణ్‌కుమార్

దహెగాం: గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గిరవెల్లి గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్‌లో గిరవెల్లి, కన్నెపల్లి జట్లు తలపడగా గిరవెల్లి జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.20 వేలు నగదుతో పాటు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు నగదు, కప్‌షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, నిర్వాహకుడు దందెర మల్లేశ్, నాయకులు షాకీర్, బాలు, రాజ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఆసిఫాబాద్‌అర్బన్: గత జూలై, అక్టోబర్ నెలలో మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న మీన, నందుకుమార్‌లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సెల్‌ఫోన్‌ల ట్రేస్‌చేసి గుర్తించారు. మొబైల్ ఫోన్‌లను బాధితులకు మంగళవారం అందజేశారు. పోగొట్టుకొన్న ఫోన్‌లను తిరిగి అప్పగించినందుకు సీఐ రవీందర్, సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

'అటవీ సంరక్షణ అందరి బాధ్యత'

బెజ్జూర్: అటవీ సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్‌ఎస్‌వో మల్లికార్జున్ అన్నారు. ఎఫ్‌ఆర్‌వో ముసవీర్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో అటవీ శాఖ అధికారులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌వో మాట్లాడుతూ చలి తీవ్రత అధికంగా ఉన్నందున కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. అడవిలో నిప్పు అంటించవద్దని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు వెంకటేశ్, మురళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ అన్నారు. మంగళవారం సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని గిరిజన గ్రామాలు పూసిగూడ, రావన్‌పల్లి, మేడిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌ఆర్‌వో ఇక్బాల్ హుస్సేన్, ఎఫ్‌ఎస్‌వోలు మోహన్‌రావ్, వందన, మారుతి, మోతిలాల్, సుబాన్‌గౌరీ, బీట్ అధికారులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ

ఆసిఫాబాద్‌రూరల్: పిల్లల సౌకర్యం కోసం నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టినట్లు సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అన్నారు. మంగళవారం మండలంలోని కోసార గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

సిర్పూర్(టి): యువతి, యువకులు ట్రాఫిక్ నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కమలాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వాహనాలపై ప్రయాణాలు, ట్రాఫిక్ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల (ఎస్టీ బాలుర)లో విద్యార్థులకు కళాబృందం ద్వారా అవగాహన కల్పించారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: సీనియర్ సిటిజన్‌ల సంక్షేమ చట్టం 2007పై అన్ని మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సీనియర్ సిటిజన్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు మద్దతు

కాగజ్‌నగర్‌రూరల్: పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. వారికి మద్దతుగా బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా కన్వీనర్ అంబాల ఓదెలు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జయదేవ్, ఉపాధ్యక్షులు నర్సయ్య, ప్రజాసంఘాల వేదిక అధ్యక్షులు అల్లి రాజయ్య మంగళవారం మద్దతు పలికారు.

పల్లెల్లో మద్యం దందా!

- గల్లీగల్లీకి బెల్ట్ షాపులు
- గ్రామాల్లో తనిఖీలు శూన్యం
- మద్యానికి బానిసవుతున్న యువత



కౌటాల: మండలంలోని పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. మండలంలోని బెల్టు షాపుల్లో మద్యం దందా ×మూడు పువ్వులు.. ఆరు కాయలు౯ అన్న చందంగా నడుస్తోంది. బెల్టుషాపుల దందాను ఇటు వైన్స్‌షాపుల యజమానులు, అటు అబ్కారీ అధికారులు ప్రోత్సహిస్తుండడంతో గ్రామాల్లో మద్యం దందా జోరుగా సాగుతోంది. గ్రామాల్లో మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ముడుపులు తీసుకుంటూ గొలుసు దుకాణాలను చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

రాత్రి, పగలు మందు..

జిల్లావ్యాప్తంగా మద్యం దొరకని గ్రామం అంటూ లేదంటే అతిశయోక్తి కాదు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఎక్కడపడితే అక్కడ మద్యం లభిస్తోంది. టార్గెట్ చేరుకోవడానికి వైన్స్‌ల యజమానులే గొలుసు దందాను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో 32 మద్యం దుకాణాలు 3 బార్లు ఉన్నాయి. ఏటా రూ. 200 కోట్లకు పైగా సరుకు అమ్ముడవుతోంది. మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా వాటి సంఖ్య 900లకు పైగా ఉన్నాయి. సమీప వైన్స్‌లలో కొనుగోలు చేసిన మద్యం అధిక ధరలకు ఇక్కడ విక్రయిస్తున్నారు. రహదారుల పక్కనే ఉన్న వాటిలో మందు నిరంతరం లభించడంతో వాహనదారులు తాగి నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు కౌటాల, వాంకిడి, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలిసిన బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

మత్తు.. యువత చిత్తు..

మద్యం మత్తులో నేటి యువతరం తేలుతోంది. తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దేశ భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన యువకులు మద్యానికి బానిసై మత్తులో చిత్తవుతున్నారు. గ్రామాల్లో మద్యం మత్తులో యువత గొడవలు పడుతున్నారు. అడ్డు చెప్పే వారి పైనే దాడులకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి. పలువురు మద్యానికి బానిసై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లోని బెల్ట్ షాపులను తొలగించాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

పట్టించుకోని అధికారులు..

జిల్లాలోని వైన్స్ షాపుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారీతిన మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. గరిష్ట అమ్మకం ధర కంటే ఎక్కువగా మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలిస్తున్నారు. అక్కడ క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ. 20, బీరు బాటిల్‌పై రూ. 30 నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు. ప్రతీరోజు వైన్‌షాపుల్లోని ప్రత్యేక కౌంటర్ల ద్వారా మద్యాన్ని బెల్ట్‌షాపులకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. వైన్స్‌ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్నిచోట్ల మాంసాహారం విక్రయాలు సైతం జరుగుతున్నాయి. ప్రధాన రహదారులపై ఉన్న వైన్స్‌ల వద్ద రహదారులపై మందుబాబులు సీసాలు పెట్టుకుని తాగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. అబ్కారీ శాఖ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి గ్రా మాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కౌటాలలో బెల్ట్‌షాపులో మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబు

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

రెబ్బెన: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గోలేటిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ రెబ్బెన నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ అలుపెరగని పోరాటాలు చేసిందన్నారు. సుప్రీంకోర్టు సైతం వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియను చేపట్టేలా ఒత్తిడి పెంచేందుకు ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల ప్రదర్శన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగలు, ఉపకులాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రెబ్బెన మండల నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గం

ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షుడిగా ఇప్ప నవీన్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దుర్గం అనిల్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం రాజ్‌కుమార్, అధికార ప్రతినిధిగా నక్క కిరణ్‌తో పాటు గోలేటి గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా దుర్గం జనార్దన్, అధ్యక్షుడిగా ఇగురపు రాజశేఖర్, ఉపాధ్యక్షుడుగా నక్క ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా దూడల దశరథ్, పోగుల నవీన్‌లను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ యువనాయకులుగా జంగంపెల్లి రాజేశ్, జిల్లా కార్యకర్తగా దుర్గం రాకేశ్‌లకు స్థానం కల్పించారు. కార్యక్రమాల్లో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్య, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు మహేశ్, మండల నాయకులు రాజేందర్, లింగంపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

కౌటాల జీపీని విడదీయొద్దని వినతి

కౌటాల: కౌటాల గ్రామ పంచాయతీని రెండు జీపీలుగా విడదీయొద్దని స్థానిక నాయకులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కోట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌటాల పంచాయతీ పరిధిలోని సదాశివపేట, శివలింగపూర్, నదీమాబాద్‌ను కలిపి ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, కొంతమంది నేతలు తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం గ్రామ పంచాయతీని విడదీసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కౌటాలను మేజర్ గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క శంకర్, పెద్దపల్లి మల్లయ్య, పోశం, సిద్ధయ్య, సాయికుమార్, శ్యాంరావు ఉన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సరీ పనులు పూర్తి చేయాలి

లింగాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు ఉపాధిహామీ క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2024 -25 సంవత్సరానికి సంబంధించిన పనులపై సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్న నర్సరీ పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో తెలిపారు. విత్తనాలు నాటేందుకు పాలిథీన్ కవర్లను, ఎర్ర మట్టి, చెరువు మట్టి, ఎరువులను తెప్పించి బ్యాగు ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలలో శానిటేషన్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. త్వరలోనే ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు మండలానికి రానున్నట్లు పేర్కొన్నారు. రికార్డులను సరి చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రజనీకాంత్, మండల పంచాయతీ అధికారులతో పాటు ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణారావు

వన నర్సరీల పరిశీలన

మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన వన నర్సరీలను మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ప్రతీ గ్రామ పంచాయతీకి 10వేల మొక్కలు పెంచాలని సిబ్బందికి సూచించారు. నర్సరీల్లో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి భీంరావ్, టెక్నికల్ అసిస్టెంట్ భీంరావుకు తెలిపారు.

సులభ్‌కాంప్లెక్స్‌లు నిర్మించేదెప్పుడో..?

- జిల్లాకేంద్రంలో ఒంటికి, రెంటికీ కష్టాలే
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు



జిల్లాకేంద్రంలోని ప్రధాన చౌరస్తా

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా మారడంతో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఎక్కడా ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడ కాస్తంత ఖాళీ స్థలం కనిపించినా మగవారు మూత్ర విసర్జన చేస్తున్నారు. కానీ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం కావడంతో మహిళలు చాలా తిప్పలు పడుతున్నారు.

ఖాళీ స్థలాలు, ఆర్టీసీ బస్టాండే దిక్కు..

జిల్లాకేంద్రంలో తోపుడు బండ్లు, రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. జిల్లాలోని వివిధ మండలాల వాసులు వివిధ పనుల నిమిత్తం నిత్యం జిల్లా కేంద్రానికి వచ్చి పోతుంటారు. వారికి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా కేంద్రానికి వచ్చి పోయే ప్రజలతో పాటు వ్యాపారులు, వ్యాపార సముదాయాలలో పని చేసే వారు మూత్ర విసర్జనకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక చాలా మంది ఆర్టీసీ బస్టాండ్ వైపు పరుగులు తీస్తున్నారు. దిక్కులేని పరిస్థితుల్లో పురుషులు పట్టణంలోని ఖాళీ స్థలాల్లో మూత్ర విసర్జన చేపట్టడంతో ఖాళీ స్థలాలు కంపు కొడుతున్నాయి. కానీ మహిళలు మాత్రం పడరాని పాట్లు పడుతున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని బయట మూత్ర విసర్జన చేయరాదని చెబుతున్నప్పటికీ జిల్లా కేంద్రంలో మాత్రం ప్రజా మూత్ర శాలలు, మరుగుదొడ్లను నిర్మించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

మూత్రశాలలు ఏర్పాటు చేయాలి



జిల్లా కేంద్రంలో ప్రజా మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. ప్రజా మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రధాన కూడళ్లలో, పట్టణంలోని అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, వివేకానందచౌక్, గుండి రోడ్డు, జన్కాపూర్, బాబాపూర్ ఎక్స్‌రోడ్డుల వద్ద ప్రజా మూత్రశాలలతో పాటు మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలి. – ఆవిడపు ప్రణయ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



పట్టణంలో మరుగుదొడ్ల నిర్మాణాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలి. సదుపాయాలు కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా అధికారులే చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టణంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. – దుర్గం దినకర్, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యుడు

ప్రతిపాదనలు పంపాం..

జిల్లా కేంద్రంలో సదుపాయాల కల్పనకు, పలు ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మరుగుదొడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతాం. – భుజంగ్‌రావు, మున్సిపల్ కమిషనర్, ఆసిఫాబాద్

చిన్ననాటి స్నేహితుల ఔదార్యం

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుపేద కుటుంబానికి చెందిన స్నేహితుడు మృతి చెందితే అతని కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సాయం అందజేసి తమ ఔదార్యం చాటుకున్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని టీఆర్‌నగర్‌లో నివసిస్తున్న మల్లేశ్ (48) అనారోగ్యంతో గతేడాది నవంబర్‌లో మృతి చెందాడు. అతనికి తల్లి, భార్య, కుమార్తె ఉన్నారు. పేద కుటుంబం కావడంతో అతని చిన్ననాటి స్నేహితులు కలిసి బాధిత కుటుంబానికి మంగళవారం రూ.15వేలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. మల్లేశ్ కుమార్తె చదువుల కోసం రూ.45వేల విలువ చేసే బాండ్‌ను తీసినట్లు వారు తెలిపారు. స్నేహితులు ప్రదీప్, శ్రీధర్, రవీందర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న స్నేహితులు

'ఆదివాసీ టీచర్స్' క్యాలెండర్ ఆవిష్కరణ

కౌటాల: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఎదుట మంగళవారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో గావుడే హన్మంతు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల తిరుపతి, సంఘం మండలాధ్యక్షులు మడావి పోచాని, నాయకులు అశోక్, అంతయ్య, శ్యాంరావు, శ్రీనివాస్, శివాజీ, మహేశ్, సునీల్, కవిత, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గుంత పూడ్చేదెప్పుడు..?



జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో మిషన్ భగీరథ పైపులైన్ చెడిపోవడంతో సంబంధిత శాఖ ఆధ్వర్యంలో మరమ్మతుల కోసం పైపులైన్ వద్ద గుంత చేశారు. అయితే 10 రోజులు గడిచినా గుంతను పూడ్చివేయడం లేదు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతను పూడ్చడంలో నిర్లక్ష్యం చేస్తున్న వారిపై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, త్వరగా గుంతను పూడ్చాలని కాలనీవాసులు కోరుతున్నారు. – ఆసిఫాబాద్‌అర్బన్

పత్తి విక్రయానికి పాట్లు

- ప్రతీరోజు 1500 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు
- రోజుల తరబడి క్యూలైన్‌లోనే వాహనాలు
- వాహనాల్లోని సామగ్రి, పత్తి ఎత్తుకెళ్తున్న దొంగలు

కౌటాల: కౌటాల వైష్ణవి మాత జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించడానికి వచ్చిన రైతులకు అటు పడిగాపులతో ఇటు దొంగల బీభత్సంతో తిప్పలు తప్పడం లేదు. వారం రోజుల అనంతరం పత్తి కొనుగోళ్ల ప్రారంభించడంతో సీసీఐ కేంద్రానికి వందలాది వాహనాలు తరలివచ్చాయి. సీసీఐ అధికారులు సక్రమంగా పత్తి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో పత్తి వాహనాలు రోజుల తరబడి క్యూలైన్‌లో వేచి ఉంటున్నాయి. రాత్రి సమయాల్లో వాహనాల్లోని సౌండ్ బాక్స్‌లు, ఇతర యంత్రాలను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. మరో వైపు గుర్తు తెలియని వ్యక్తులు పత్తిని సైతం దొంగలిస్తున్నారని రైతులు వాపోతున్నారు. రూ. వేలల్లో నష్టం జరుగుతుందని, పోలీసులు దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా సీసీఐ అధికారులు ప్రతీరోజు కేవలం 1500 క్వింటాళ్ల పత్తిని మాత్రం కొనుగోలు చేస్తుండడంతో సీసీఐ పత్తి విక్రయించడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రోజుల తరబడి వాహనాలు ఖాళీ కాకపోవడంతో వాహన యజమానులు వెయిటింగ్ చార్జీల కింద రైతుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కౌటాల సీసీఐ కేంద్రం వద్ద వాహనాల పడిగాపులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో టీయూటీఎఫ్ 2025 క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల సదాశివ్, అసోసియేట్ అధ్యక్షుడు ప్రకాశ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇస్లావత్ ధన్‌రాజ్, ఉపాధ్యాయులు శంకర్‌రావ్, హన్మంతు, రామకృష్ణ, రమేశ్, రాజన్న, సుభాశ్, కృష్ణమూర్తి, నగేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే